ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు

- వలు చోట్ల శిథిలం
- మరికొన్ని చోట్ల మూతలు లేకుండా నోళ్లు తెరుచుకున్న మ్యాన్‌హోళ్లు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో పలుచోట్ల మ్యాన్‌హోళ్లు పూర్తిగా శిథిలమయ్యాయి. వీటి నిర్మాణానికి రూ.కోట్లల్లో ఖర్చు చేసినా నాణ్యత లేకపోవడంతో పాటు వర్షాలు వస్తే రోడ్లన్నీ మురుగునీటితో ముంచెత్తుతున్నాయి. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్ నుంచి డాక్టర్స్ కాలనీ మీదుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే దారిలో మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా మారాయి.


ఇస్లాంపురలోని ప్రధాన రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్


మిర్యాలగూడ పట్టణంలో నోరు తెరుచుకొని ఉన్న మ్యాన్‌హోల్

మరికొన్ని ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లపై మూతలు లేకుండా పూర్తిగా నోళ్లు తెరుచుకున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మ్యాన్ హోళ్లు ప్రమాదకరంగా ఉన్నాయి



మున్సిపాలిటీలో ఎక్కడపడితే అక్కడ మ్యాన్‌హోళ్ల నోళ్లు తెరుచుకుని ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇస్లాంపురలో మ్యాన్‌హోళ్లు ధ్వంసం కావడంతో తూతూ మంత్రంగా మ్యాన్‌హోల్ రింగ్ పెట్టారు. దీంతో ఇబ్బందిగా మారింది. శిథిలావస్థకు చేరిన మ్యాన్‌హోళ్లతో ప్రమాదాలు పొంచిన ఉన్నందున అధికారులు దృష్టి సారించాలి.
– మహ్మద్ అబ్దుల్ అలీం, ఇస్లాంపుర

యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం



గతంలో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణంలో భాగంగా పబ్లిక్ హెల్త్ వింగ్ ఆధీనంలో మ్యాన్‌హోళ్ల నిర్మాణ పనులు నడిచాయి. ప్రస్తుతం మా పరిధిలో లేదు. అయినా ఈ విషయంపై పబ్లిక్ హెల్త్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకుంటాం. నేను ఇటీవలనే వచ్చినందున మ్యాన్‌హోళ్లకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుంటాను.
– శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

కోటమైసమ్మ ఆలయం మూసివేత


మూసివున్న కోటమైసమ్మ ఆలయం

నిడమనూరు : చంద్రగ్రహణం కారణంగా నిడమనూరు మండలంలోని మార్తువారిగూడెం గ్రామ సమీపంలో గల శ్రీకోటమైసమ్మ ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని పురాతన శివాలయం, రామాలయం, దేవాదాయ శాఖ పరిధిలోని తుమ్మడం రామాలయం మూసివేశారు.

మహిళకు అరుదైన ఆపరేషన్

మిర్యాలగూడ అర్బన్: తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్న మహిళ కడుపులోంచి మూడు కిలోల కణతిని వెలికితీశారు మిర్యాలగూడ వైద్యులు. పట్టణంలోని అంజిరెడ్డి రివర్ హాస్పిటల్‌లో ఈ అరుదైన ఆపరేషన్ శనివారం జరిగింది. వివరాలు.. నల్లగొండ పట్టణానికి చెందిన ఫాతిమాబేగం కొన్నాళ్లుగా కడుపునొప్పితో బాధపడుతూ ఈ నెల 5వ తేదీన మిర్యాలగూడ అంజిరెడ్డి రివర్ హాస్పిటల్‌కు వచ్చింది. ఆమెకు వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి.. మహిళ కడుపులో గర్భాశయం, మూత్రనాళానికి అతుక్కుని పోయినట్లుగా ఓ పెద్ద కణతి ఉన్నట్లు అత్యాధునిక స్కానింగ్ ద్వారా గుర్తించారు. మూత్రనాళం పని చేయకుండా అడ్డుగా ఉన్న కణతిని తొలగించేందుకు వైద్యులు సుమారు 6గంటల పాటు శ్రమించారు. అతి క్లిష్టమైన ఆపరేషన్‌ను ఆస్పత్రికి చెందిన ఐదుగురు వైద్యుల బృందం పూర్తి చేశారని తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గర్భాశయంలో కణతులు ఏర్పడడం వల్ల అధికంగా రక్తస్రావం, వెన్నునొప్పి, మూత్రాశయంపై వత్తిడి, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న బైరం దయానంద్

మిర్యాలగూడ: పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని దామరచర్ల సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్ అన్నారు. ఆదివారం దామరచర్ల మండల గ్రామపంచాయతీ కార్మికుల మహాసభ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వాడపల్లి శ్రీరాములు, అక్కెనపల్లి సైదులు, ఎండీ జైహింద్, సైదులు, విజయ్, వెంకన్న, కనకదుర్గ, భిక్షం, నాగయ్య, జ్యోతి, గంగరాజు, సుబాని, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు చెల్లించాలి

మిర్యాలగూడ టౌన్ : మోడల్ స్కూళ్లల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను వెంటనే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఆరు నెలలుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు అందకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తక్కువ వేతనాలకు పని చేస్తున్నప్పటికీ వారికి ఇవ్వాల్సిన వేతనాలు చెల్లించకపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి ఫలాలు అందించాలి


మత పెద్దలను సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి రాజకీయాలకతీతతంగా అభివృద్ధి ఫలాలు అందించాలని ముస్లిం మైనార్టీ నేతలు అమీర్ షరీఫ్, అన్వర్, మన్నాన్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణ శివారులో గల తిరుమల టౌన్ షిప్‌లో వేములపల్లి గ్రామ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ పెద్దలు, సంఘ సేవకులు మునీర్, రషీద్, జావిద్, జలాల్, రావుఫ్, ఖలీమ్‌లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో రహీమ్, ఇమామ్, అబ్రార్, షౌకత్, హమీద్, సత్తార్, రఫీక్ తదితరులున్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

కొండమల్లేపల్లి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నల్లగొండ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలు, హిందూ ధర్మపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పగిడిమర్రి వెంకటేశం, చక్రధర్, చంద్రమౌళి, పరమేష్, రంగారెడ్డి, నాగరాజు, కమలాకర్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం సమావేశం

నిడమనూరు: గణేశ్ ఉత్సవాలు విజయవంతం కావడంతో నిడమనూరు పద్మశాలి సంఘం నాయకులు ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. నిడమనూరు శివారున ఉన్న బంగారు మైసమ్మ ఆలయం వద్ద పద్మశాలి సంఘం నాయకులు సమావేశమై సంఘం భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. రెండు దశాబ్దాలుగా గణేశ్ ఉత్సవాలను నిర్వహిస్తున్నందుకు ఎంతో గర్వంగా ఉందని పద్మశాలి సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎయిర్‌ఫోర్స్ విశ్రాంత ఉద్యోగి జీ.రమేష్, డాక్టర్ శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల పంపిణీ

మిర్యాలగూడ: పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం మిర్యాలగూడ రోటరీ క్లబ్, ఖమ్మం రోటరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో 110 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ మల్లాది వాసుదేవ్ మాట్లాడుతూ.. ఏకమ్ యూఎస్‌ఏ ఆర్థిక సాయంతో 1981లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.3.50కోట్లతో 13,500 మంది దివ్యాంగులు లబ్ధి పొందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖమ్మం రోటరీ ట్రస్ట్ అధ్యక్షుడు సాంబశివరావు, ఖమ్మం క్లబ్ అధ్యక్షుడు వి.రామారావు, మిర్యాలగూడ రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు, ప్రోగ్రాం ఛైర్మన్ రేపాల అంతయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు దయాకర్, రంగాహరినాథ, క్లబ్ సెక్రటరీ రేపాల వాసవి, క్లబ్ సభ్యులు మంచుకొండ వెంకటేశ్వర్లు, కుక్కడపు రామ్మూర్తి, మాశెట్టి సుదర్శన్, వీరయ్య, చిల్లంచర్ల రామారావు, గంధం శ్రీనివాస్, మిల్లర్స్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కోశాధికారి చిల్లంచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ మల్లాది వాసుదేవ్

నారాయణరెడ్డి ఆశయాలు సాధించాలి


రావి నారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ: సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ రావి నారాయణరెడ్డి ఆశయాలు సాధించాలని సీపీఐ నాయకుడు దేప సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో రావి నారాయణరెడ్డి వర్ధంతి నిర్వహించారు.ఈ సందర్భంగా నారాయణరెడ్డి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రావి నారాయణరెడ్డి అగ్ర భాగంలో నిలిచారని గుర్తు చేశారు. రావి నారాయణరెడ్డి జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వలమల్ల ఆంజనేయులు, పల్లా రంగారెడ్డి, జూలూరి వెంకట్రాములు, ఎం.డి. మైనొద్దీన్, వెంకటయ్య, శ్రీను, జ్యోతి బసు, పర్వతాలు, రాజమల్లయ్య, ఆనందచారి, జాకీర్ పాల్గొన్నారు.

మిల్క్ వర్కర్స్‌కు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

హాలియా : మిల్క్ వర్కర్స్‌కు ప్రభుత్వం వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలని పాడి రైతుల సంఘం రాష్ట్ర నాయకుడు రిక్కల రామాంజిరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హాలియా వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన మిల్క్ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పల్లెల నుంచి పాలు పట్టి పట్టణాల్లో ప్రతి ఇంటికి అందిస్తున్న కార్మికులను వ్యాపార పరంగా కాకుండా సేవా దృక్పథంగా చూడాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శనగల కోటేష్, విజయ్ కుమార్, కేతావత్ వెంకటేశ్వర్లు, శీలం లింగయ్య, వెంకన్న, కృష్ణారెడ్డి, బాస్కర్‌రెడ్డి, శ్రీను, చిన్న మారయ్య, శివ, వెంకన్న ఉన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు

కోటిరెడ్డి స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలి

మిర్యాలగూడ అర్బన్: కంచర్ల కోటిరెడ్డి స్ఫూర్తితో కార్మిక, కర్షక పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకుడు కంచర్ల కోటిరెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన స్థూపానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రవినాయక్, నాయకులు చౌగాని సీతారాములు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, ఆశీర్వాదం, కంచర్ల లింగమ్మ, లలితమ్మ, గోపి, అంజయ్య, సైదాచారి, యల్లయ్య, ప్రవీణ్, బోడియా, కిరియా తదితరులు పాల్గొన్నారు.


కోటిరెడ్డి సంతాపసభలో పాల్గొన్న సీపీఎం నాయకులు

గణనాథుడి లడ్డూ వేలం రూ.2,30,000

నాగార్జునసాగర్ : గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో గణనాథుడి నిమజ్జన వేడుకలు వైభవంగా నిర్వహించారు. హిల్‌కాలనీలోని క్రాంతి యూత్ ఆధ్వర్యంలో 23 సంవత్సరాలుగా గణనాథుడి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన గణేశ్ శోభాయాత్రలో భాగంగా గణనాథుడి చేతిలోని 101 కేజీల లడ్డూను స్థానిక దివ్య డిజిటల్ స్టూడియో అధినేత ఎర్రబోయిన సురేష్ రూ.రెండు లక్షల ముప్పై వేలకు దక్కించుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ఆధునిక సంప్రదాయ, నృత్యాలతో ఆనందోత్సాహాలతో గణనాథుడి నిమజ్జనాన్ని కృష్ణానదిలో నిర్వహించారు.


లడ్డూ దక్కించుకున్న సురేష్

రైతులందరికీ యూరియా అందిస్తాం

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: నియోజకవర్గంలోని రైతులందరికీ సరిపడా యూరియా అందిస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలో ఆయా మండలాలకు చెందిన ఏఓలు, ఏఈఓలు, పీఏసీఎస్ సీఈఓలు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రతి రైతుకు, ప్రతి ఎకరాకు యూరియా అందేవిధంగా వ్యవసాయాధికారులు కృషి చేయాలన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు, దళారులకు చేరకుండా చర్యలు తీసుకోవాలని, యూరియా పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేసేలా కేంద్రం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు రైతులకు అవసరమైన యూరియాను అందించేందుకు అధికారులు ప్రణాళికతో పనిచేయాలన్నారు. ప్రతి రైతుకు అవసరమైన యూరియా అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. సమావేశంలో ఆయా మండలాల ఏఓలు, ఏఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.


మిర్యాలగూడ: వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పనులను ఆయాశాఖల అధికారులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై మున్సిపాలిటీ, పబ్లిక్ హెల్త్, విద్యుత్, ఇరిగేషన్, నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పలు శాఖల పనులపై రివ్యూ తీసుకుని వాటిని త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.

యూరియా కోసం పడిగాపులు


కొండమల్లేపల్లి : యూరియా కోసం గ్రోమోర్ వద్ద గుంపులుగా రైతులు


నిడమనూరు : యూరియా గోదాం వద్ద క్యూలైన్‌లో నిలుచుని ఉన్న రైతులు

కొండమల్లేపల్లి :కొండమల్లేపల్లిలోని గ్రోమోర్ కేంద్రం వద్ద ఆదివారం రైతులు యూరియా కోసం పడిగాపులు కాశారు. గ్రోమోర్ కేంద్రానికి 440 బస్తాల యూరియా లోడ్ వచ్చిందన్న విషయాన్ని తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల రైతులు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డుతో తరలివచ్చి ఎగబడ్డారు. గ్రోమోర్ కేంద్ర నిర్వాహకులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున టోకెన్లు అందించారు. గంపులుగా ఉన్న రైతులను క్యూ లైన్‌లో ఉండాలని సూచించి, పోలీసుల సహకారంతో రైతులకు యూరియా బస్తాలను అందించినట్లు గ్రోమోర్ కేంద్రం నిర్వాహకుడు రవీందర్ తెలిపారు.

పర్యవేక్షణ లేకుండానే యూరియా పంపిణీ

నిడమనూరు : నిడమనూరు సహకార సంఘానికి ఆదివారం ఉదయం 40 టన్నుల యూరియా వచ్చింది. ఉదయం 11 గంటలలోపు యూరియా పంపిణీ పూర్తిచేశారు. ఇటీవల ఇఫ్‌కో యూరియా రాగా, ఆదివారం గ్రోమోర్ యూరియా వచ్చింది. గతంలో కూపన్లు, వేలిముద్ర, నగదు చెల్లించి రశీదు పొందిన రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఆదివారం 40 టన్నులు (888 బస్తాలు) యూరియా రావడంతో ఒక్కో రైతుకు 2 బస్తాల యూరియా చొప్పున 444 మంది రైతులకు పంపిణీ చేశారు. ఆదివారం కావడంతో వ్యవసాయాధికారులు పర్యవేక్షణ లేకుండా పోయింది.

యూరియా పంపిణీపై రైతుల నిరసన

నాయకులకు, పలుకుబడి ఉన్న రైతులకు సహకార సంఘం ఉద్యోగులు ఇష్టానుసారంగా యూరియా అందిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. బహిరంగా మార్కెట్‌లో యూరియా లేకపోవడంతో నిడమనూరు మండలంతోపాటు, చుట్టు పక్క మండలాల శివారు గ్రామాల రైతులు సైతం ఆదివారం కుటుంబ సభ్యులతో వచ్చి, మహిళలు ఒక క్యూలైన్‌లో, పురుషులు మరో క్యూలైన్‌లో బారులుదీరారు. ఒకే ఒక ఈ పాస్ మిషన్ ఉండడంతో ఒక క్యూలైనుకు అనుమతి ఇస్తుండడంతో రైతులు గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది.

11నుంచి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

నల్లగొండ టౌన్: ఈ నెల 11నుంచి 17వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలిపారు. ఆదివారం నల్లగొండలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయుధ పోరాట చరిత్ర కలిగిన చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో అమరవీరుల స్తూపం వద్ద సాయుధ పోరాట వారోత్సవాలు ప్రారంభిస్తామన్నారు. అదేవిధంగా ఈ నెల 10న మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను నల్లగొండలో నిర్వహిస్తామని.. పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లోడంగి శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరాస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, బొల్లూరి నరసింహ, తిర్పారి వెంకటేశ్వర్లు, ఆర్.అంజచారి, తూము బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం


మిర్యాలగూడ టౌన్: మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు


వేములపల్లి : ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : జీఎస్టీ తగ్గింపు, ఆరోగ్య పరంగా హెల్త్ ఇన్సూరెన్స్ జీరో జీఎస్టీతో పేదవాడికి ఉపశమనం కల్పించినందుకుగాను ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ టూ టౌన్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కనపర్తి సత్యప్రసాద్, జిల్లా నేత తుమ్మలపల్లి హన్మంత రెడ్డి, బీజేపీ నాయకులు ఎడ్ల రమేష్, లక్ష్మారెడ్డి, నజ్జల నాగిరెడ్డి, టూ టౌన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు పెద్దబోయిన వెంకటరమణ యాదవ్, గుండ్లపల్లి శ్రీకాంత్, పట్టణ ఉపాధ్యక్షులు ఐల శ్రీను, రాంప్రసాద్, కార్యదర్శి రేణుక, దాసరాజు నరేష్, సత్యనారాయణ, యాదగిరి, కిరణ్, కడియం సైదులు, జంగిలి రవికుమార్, అప్పల పాండు, పొరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మేడీ నవీన్ తదితరులున్నారు.

వేములపల్లి: జీఎస్టీ స్లాబ్‌లను కుదించి నిత్యావసర ధరలను తగ్గించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు ఆదివారం వేములపల్లి మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పెదమాం భారత్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చిర్ర సాంబమూర్తి, రాష్ట్ర నాయకులు చల్లమల్ల సీతారాంరెడ్డి, నాయకులు జవ్వాజి సత్యనారాయణ, పందిరి భాగ్యమ్మ, యాదమ్మ, ఉపేందర్, ప్రభాకర్, ఇరుగుదిండ్ల నరేష్, కుంచం వంశీ, మహేష్, మణి, నాగరాజు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి


గౌడ సంక్షేమ భవనంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : గౌడ కులస్తులకు 25శాతం మేరకు వైన్స్‌లను కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని గౌడ సంఘం డివిజన్ అధ్యక్షుడు గుండు శ్రీరాములు గౌడ్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని షాబునగర్‌లో గల గౌడ సంఘం భవనంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న వైన్స్ టెండర్ల ప్రక్రియలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 25శాతం వరకు కేటాయించాలన్నారు. సమావేశంలో సంఘం నేతలు సురకారపు ఉదయ్ భాస్కర్ గౌడ్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, తిరుపతయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, విజయ్ శేఖర్, రాము గౌడ్, సత్యం గౌడ్ తదితరులున్నారు.

పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలి

నల్లగొండ టౌన్: జిల్లాలో పెండింగులో ఉన్న కార్మికుల క్లెయిమ్స్‌ను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని సుందరయ్య భవనంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాళీగా ఉన్న ఏఎల్‌ఓ, ఏసీఎల్ ఇతర సిబ్బంది నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా 60 సంవత్సరాలు పైబడిన కార్మికులకు రూ.9 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పోలె సత్యనారాయణ, దోటి పరమేశ, సీఐటీయూ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, గాదె యాదయ్య, దోటి పరమేశ, బొల్లం సత్తయ్య, వెంకన్న, ఉప్పునూతల పోలె ప్రేమయ్య, కొత్తపెల్లి కృష్ణ, లింగస్వామి, వెంకన్న, రవి పాల్గొన్నారు.

బడిని, విద్యార్థులను వదిలి సన్మానానికి..

కొండమల్లేపల్లి(చింతపల్లి) : పాఠశాలల పటిష్టత, ఉపాధ్యాయుల హాజరు నమోదు కోసం ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌ఎస్ ముఖ గుర్తింపు హాజరును ప్రవేశపెట్టింది. ఉదయం, సాయంత్రం ఉపాధ్యాయులు హాజరు నమోదు చేయవలసి ఉంటుంది. అయితే కొంత మంది ఉపాధ్యాయులు ఉదయం హాజరు నమోదు చేసుకున్న తర్వాత పాఠశాలకు డుమ్మా కొట్టి సొంత పనులు చేసుకుంటున్నారు. మళ్లీ సాయంత్రం పాఠశాలకు వచ్చి హాజరు నమోదు చేసుకుంటున్నారు. చింతపల్లి మండల పరిధిలోని కుర్మపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయినులు ఒక ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పని చేస్తున్నారు. ఇదే మండలంలో గల కిష్టరాంపల్లి పాఠశాలలో పనిచేసే ఓ ఉపాధ్యాయురాలు ఈ నెల 5న జిల్లాస్థాయి అవార్డు పొందింది. ఆ ఉపాధ్యాయురాలిని సన్మానించేందుకు కుర్మపల్లి పాఠశాలలో పనిచేసే హెచ్‌ఎంతో కలిపి ఐదుగురు ఉపాధ్యాయినులు శనివారం పాఠశాలను, విద్యార్థులను వదిలేసి కిష్టరాంపల్లి పాఠశాలకు వెళ్లారు. ఈ విషయమై ఎంఈఓ అంజయ్యను వివరణ కోరగా.. కుర్మపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాఠశాలను, విద్యార్థులను వదిలి వెళ్లిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంకుగానీ, తనకు గాని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పక్క గ్రామంలో సన్మాన కార్యక్రమానికి వెళ్లడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ విషయంపై విచారణ చేపడతామన్నారు.


కిష్టరాంపల్లిలో సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కుర్మపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు